చెయ్యడం ఎందుకని సరేనన్నాను. ఆపరేషన్ దగ్గర వుండి జరిపించాను కూడా. డిశ్చార్జ్ అయిన మర్నాడు ఎలా ఉన్నాడో చూద్దాం అని వెళ్ళాను. తలుపులు వేసేసి 'ఇంక నీ ముఖం నాకు ఈ జన్మలో చూపించకు. మళ్ళీ కనిపించావో నరికేస్తాను' అన్నాడు. జోక్ వేస్తున్నాడనుకున్నాను. తన్నబోయేడు. కాళ్ళావేళ్ళా పడ్డాను కారణం చెప్పమని. చెప్పనుగాక చెప్పను. ఆలోచించు నీకే తెలుస్తుంది అన్నాడు. ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. అక్కణ్ణుంచి కదలకపోతే నౌఖర్లతో మెడపెట్టి గెంటేస్తానన్నాడు. పదిమంది మధ్య పరువు పోవడం ఇష్టం లేక వచ్చేశాను. ఆరోజు నుంచి ఈ రోజు వరకు మొత్తం అన్ని సంబంధాలూ కట్. ఎంత గింజుకున్నా నాకు అర్థంకావటంలేదు. వాడెందుకలా ప్రవర్తించాడో..! నీతో తప్ప ఇంకెవరితోనుచెప్పుకోలేను. ఎందుకంటే మన ముగ్గురం ఒకటి అనే కదా ఊళ్ళో మనకి పేరు. అంచేత నువ్వే పూనుకోవాలి... ప్లీజ్'' అని ప్రాధేయ పడ్డాడు రాఘవ.

సరేవాడేం చెప్తాడో చూస్తానని రాజారాం ఇంటికి బయల్దేరాడు రఘుపతి.

''నాకు తెలుసు... నువ్వీ ప్రశ్న అడుగుతావని, నేను సమాధానం చెప్పాలి అని! పూర్తిగా విన్న తర్వాత నువ్వే చెప్పు నా నిర్ణయం సరిమైనదో కాదో'' అంటూ మొదలుపెట్టాడు రాజారాం.

''మూణ్ణెల్ల క్రితం నేను ఫామిలీప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నాను. నీకు తెలుసుగా... ఈ గవర్నమెంటు ఆస్పత్రులు, వాళ్ళ డబ్బులు ఆవ్యవహారం అదీ నాకు నచ్చదని... అయినా మనకేం లోటు అని ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లోనే చేయించుకున్నాను. వీడు... ఈ రాఘవగాడు ఎందుకు లేరా నేను చేసేస్తానన్నాడు. నాక్కూడ వీడిచేత చేయించుకొందాం అనిపించింది — ఎంతైనా ప్రాణమిత్రుడు కదా ఇచ్చితంగా పరాయి డాక్టర్ కన్నా జాగ్రత్తగా చూసుకుంటాడన్న నమ్మకంతో. అయినా మా ఆవిడ ఒప్పుకోలేదు. 'వద్దండీ... నా మీద మీకు ఏ మాత్రం అభిమానం ఉన్నా వేరే డాక్టర్‌తోనే చేయించుకోండి' అని పట్టుపట్టింది.

సర్లే అని వాడికి ఎలాగోలా నచ్చచెప్పి ప్రైవేట్ నర్సింగ్‌హోమ్ లో చేయించుకున్నాను. ఆపరేషన్ టైమ్‌లో తను ఫామిలీ డాక్టర్‌గా దగ్గరుండి తీరాలి అని మొండికేసుకొని కూచున్నాడు.

''ఫామిలీ ప్లానింగ్ ఆపరేషన్‌కి అంతగా పట్టుబడతారేటండీ?'' అని నవ్వేశారు ఆ ప్రైవేట్ నర్సింగ్‌హోం డాక్టర్లు.

అయినా వీడు వినలేదు. తను ఉండి తీరాలన్నాడు. 'సర్లే... మనం అంటే ప్రాణం పెడతాడు కదా' అని నేనే కల్పించుకొని 'ఉండనివ్వండి' అంటూ ఆ డాక్టర్లని రిక్వెస్ట్ చేశాను. ఆపరేషన్ టైమ్‌లో ఏమయిందో తెలుసా?''

''ఏమయింది?'' అడిగాడు రఘుపతి ఆత్రుతగా.

''నాకు మత్తు ఇంజక్షను ఇచ్చారు కదా. ఏమీ తెలియదనుకున్నాడు కాబోలు అదృష్టవశాత్తు వాడు అన్న మాటలన్నీ వినిపించాయి''.

''ఏమన్నాడు?'' అన్నాడు రఘుపతి గుండె విపరీతమైన వేగంతో కొట్టుకుంటుండగా.

''డాక్టర్లు ఓ నెర్వ్‌కట్ చేశారు. నొప్పి తెలియకపోయినా నాకు స్పర్శ తెలుస్తూనే ఉంది. ఆ టైమ్‌లో వాడు అంటాడూ ''హమ్మా ఇదా కట్ చెయ్యాలి'' అని. ఇపుడు చెప్పు రఘుపతీ. ఆ వెధవని నమ్మి వాడి చేతే ఆపరేషన్ చేయించుకుంటే ఏవి కట్ చేసేవాడు? ఆ ఆపరేషన్ నేర్చుకోడానికి నేనే దొరికానన్నమాట. అందుకే వాడికి ముఖం చూపించవద్దాన్నాను''అని ముగించాడు రాజారాం.

---

మినీకథ

# ప్లాన్

తలలో మల్లెలతో తెల్ల చీరకట్టుకొని దేవకన్యలా తయారయింది సునీత. ఆమెను చూసి నిగ్రహం ఆపుకోలేక దగ్గరకు వచ్చాడు సుందరం. సునీతకు భర్త దగ్గరకు రావడం యిష్టం లేదు. అయినా తప్పని పరిస్థితిలో అతని పక్కన చేరింది.

ఇరువురూ బాహ్య ప్రపంచాన్ని మరువలేదు. ఎవరి ఆలోచనలో వాళ్ళుండగానే కార్యక్రమం ముగించారు.

ఎలా ఉంది? ఎప్పటిలాగే అడిగాడు సుందరం భార్యను.

నిర్లిప్తంగా 'ఎలాగున్నా ఫరవాలేదు లెండి' అనేసింది. ఎప్పుడూ ఫెంటాస్టిక్, స్వర్గం అనే పదాలు ఉపయోగించే భార్య అలా నీరసంగా మాట్లాడేసరికి చెప్పలేని నీరసం వచ్చేసింది సుందరంలో.

ఆ మర్నాడు అన్యమనస్కంగానే ఆఫీసుకి వెళ్ళాడు. సునీత రోజూ రంభలా తయారవుతూనే ఉంది. భర్త తమ సంగమం తరవాత ఎలా ఉంది అని అడుగుతుంటే అసలేమీ తృప్తిగా లేదు అని సమాధానం ఇస్తుంది సునీత.

సుందరంలో తన మగతనంపై అపనమ్మకం పట్టుకుంది. ఏ పనీ చేయ్యలేకపోతున్నాడు. భయంకరమైన క్రూరమృగాల మధ్య తానొక్కడే ఉన్నంతగా భయపడిపోతున్నాడు.

'ఎందుకు సడన్‌గా నా ఆరోగ్యం దెబ్బతింది?' అని పదేపదే ఆలోచిస్తున్నాడు.

ఆఖరికి డాక్టర్‌ని కన్సల్టు చేసాడు. ఆయన ఏం లోపం లేదన్నారు. అయినా సుందరం తృప్తికోసం ఏవో మందులు వ్రాసి యిచ్చారు.

అయినా సునీత జవాబులో ఏ విధమైన మార్పులేదు. అసలు భర్తను ఇప్పుడు దగ్గరకు రానీయడం లేదు. ఎందుకని అడిగితే 'మీరు నన్ను ఎక్జయిట్ చేసి వదిలేస్తారు. ఆ తరువాత నా తిప్పలు నేను పడవలసి వస్తుంది' అని తెగేసి చెప్పేసింది.

ఇప్పుడు సుందరంలో కొత్త భయం చోటు చేసుకుంది. తాను యింట్లో లేనప్పుడు తన కోరికలు తీర్చుకోడానికి భార్య అడ్డదారులు తొక్కుతుందేమోనని.

ఆ ఊహరాగానే నెల, రెండు నెలలు మూడు నెలలు అలా శలవు పొడిగించేసాడు భార్యకు కాపలాగా.

సుందరం ఆఫీసుకు రాకపోవడంతో సుందరం గర్ల్ ఫ్రెండ్ అతని ఫ్రెండ్‌షిప్‌కి గుడ్‌బై కొట్టేసి అర్జంటుగా పెళ్ళిచేసేసుకుంది.

ఆ వార్త విన్న సునీత హమ్మయ్య! యింక నా భర్త చిన్నిల్లు సెటిల్ చేయలేదు అనుకొని యిప్పుడు యధావిధిగా భర్తకు సహకరించి, చాలా బావుంది అంటూ అతన్ని మనుపటిలాగే ముద్దులలో ముంచెత్తుతోంది. అతనూ ఆఫీసుకి శలవు పెట్టాల్సిన పరిస్థితే మరెప్పుడూ రాలేదు. గర్ల్‌ఫ్రెండ్ దగ్గర మగసిరి తక్కువైతే తలెత్తుకుండా తిరగలేనని సుందరం మరెప్పుడూ ఏ అమ్మాయి జోలికీ వెళ్ళలేదు.

—రాధిక